# తీర్థం

ఊరిపెద్ద వెంకన్న యింట్లోనే, వెంకన్న కొడుక్కి మశూచిసోకింది. నూకాలమ్మ గుడిపెద్ద అయిన స్వామినాయుడు కూతురికి మశూచి సోకింది.

'యేటా సంబరాలు, జాతరలు చేయిత్తన్నా, నన్నూ కాపాడనే పోయిందన్న మాటా తల్లీ' అన్నాడు స్వామి నాయుడు అతని భార్యతో.

ఆ రాత్రే గణాచారి వీరమ్మకి నూకాలమ్మ పూనింది. గణాచారి వీరమ్మ జుట్టు విరబోసుకుని, వేపరొట్ట చేత్తో పట్టుకుని, తడిబట్టలతో వూరిమీద పడింది.

చీకట్లో వంటరిగా తూలుతూ నడుస్తూ "నరలారో ఓఓయ్! నేనింకీ వూరుని కాయలేనర్రోయ్........ సుట్టు పక్కలున్నా నా అక్కలు సెల్లెల్లు ఆకలి తీరక మనూరు మీద యిరుసుకు పడతన్నారర్రోయ్...." అని ఏవేవో అంటూ గుడిపెద్ద స్వామినాయుడు యింటి ముందు ఆగింది.

గణాచారి వెనకాల బెరుకు బెరుగ్గా కొందరు కుర్రాళ్ళు 'నువ్వు నీ బిడ్డల్ని కాసుకోపోతే యింకెవరు కాత్తారు తల్లీ?' అంటూ కొందరు తల నెరసిన వాళ్ళు అన్నారు.

ఈ సందడికి స్వామినాయుడు బయటకొచ్చాడు. 'నీకేటి లోటు సేసాను సెప్పుతల్లా? నా యింట్లో కూడా ఆ సల్లని తల్లి అపడ్డవేటి సెప్పుతల్లా?' అన్నాడు చేతులు జోడించి.

'నాకాకలి తీరటం నేదురోయ్ నరుడా! మమ్మల్ని మీరంతా మరిసి పోనార్రోయ్ నరుడా....' అంటూ వీరావేశం ఎత్తినట్టు వళ్ళు విరుచుకుని, పెద్ద పెద్ద ఆవులింతలతో వూగిపోతోంది గణాచారి వీరమ్మ.

'యేటి కావాలో నడిగి సేయించుకోవాల కాని నీ బిడ్డల్నిలా నంజుకుంటే ఎట్టా సెప్పు తల్లా' అంది స్వామినాయుడు తల్లి సముద్రం బతిమాలుతోన్న ధోరణిలో.

'నేను కాయనే పోతన్నానే....నూటొక్క గంగలూ యిరుసుకుపడిపోతే నేనేం సేత్తానే.....' అంటూ మళ్ళీ పాత ధోరణిలో జవాబిచ్చింది గణాచారి.

"ఈ యేడు నీ జాతర గొప్పగా సేయిత్తాను. ఎప్పుడూ జరగనంత తీరతం జరిపిత్తాను. నీకు నచ్చిన ఆరం యిత్తాను నీ పజల్నికాయి తల్లా, నా బిడ్డని సల్లగా సూడు తల్లా" అని మొక్కుకున్నాడు స్వామినాయుడు.

గణాచారి పూనకం క్రమేణా తగ్గుముఖం పట్టింది. ఎవరో ఓ కడవనీళ్ళలో పసుపు కలిపి గణాచారి నెత్తిమీంచి దిగబోసారు. రెండు ముంతలు మజ్జిగిచ్చారు. ఆ మజ్జిగ తాగి, చేతిలోని వేపకొమ్మల్ని విసిరేసి యింటికిపోయింది గణాచారి.

మొత్తానికి ఆయేడు అవ్వూరు, ఆ వూరికి చుట్టుప్రక్కలున్న వూళ్ళు కుత కుత వుడికిపోయాయి. కలరా, మశూచి ఒకదాని తరువాత ఒకటి ఆ వూళ్ళని దులిపేశాయి. మార్పంటే మైలు వెనక్కి పరుగెత్తే ఆ వూళ్ళ జనానికి కళ్ళెదుట కనుపించే ఆరోగ్యశాఖ వుద్యోగులపై కంటె, కళ్ళకు కనుపించని నూకాలమ్మపైనే ఎక్కువ నమ్మకం, గురి వుండడంతో చాలా జననష్టం జరిగిపోయింది.

స్వామినాయుడు కూతురికి చావు తప్పి కన్నులొట్టపోయింది. వెంకన్న కొడుక్కి ఓ కాలు తోడేసింది. ఆ పిల్ల లిద్దరూ బతికి బయట పడ్డం నూకాలమ్మ దయని ఆ పెద్దలిద్దరూ నమ్మారు.

యేటా సంవత్సరాదికి నూకాలమ్మ తీర్థం. సంవత్సరాది వచ్చింది. ఆ వూరి పెద్ద వెంకన్న, గుడిపెద్ద స్వామి నాయుడు పూనుకొన్నారని – ఆ ఏడు నూకాలమ్మ తీర్థం ఎంతో ఘనంగా జరుగుతుందని – చుట్టుపక్కలున్న వూళ్ళవాళ్ళకి అప్పటికే ఆనోట ఆనోటా వుప్పందింది. "ఈ యేడు ఎనుబోతునేత్తారట" అని వూళ్ళమ్మట వేడుగ్గా చెప్పుకుంటున్నారు జనం.

సంవత్సరాది పండుగ, ఆ ప్రాంతం రైతాంగానికి, వ్యవసాయ కూలీ జనానికి ఎంతో ముఖ్యం. రైతు కొత్తబట్టలు కట్టుకొని కొత్త నాగలిని చేపట్టి యేరువాక సాగుతాడు. పాలి కాపులు కొత్తగా పనిలోకి చేరుతారు. వ్యవసాయపు పనుల రద్దీ సద్దణగుతుంది ఆ పండుగ నాటికి. దాంతో ఖాళీగా వున్న జనం ఆ తీర్థానికి తప్పకుండా వస్తారు. తీర్థం మరీ ముమ్మరంగా జరుగుతుందని వినడంతో జనం కూడా చుట్టుపక్కల వూళ్ళనుంచి తండోపతండాలుగా బయలుదేరి వస్తున్నారు.

రెండెడ్ల బళ్ళు కట్టుకుని పిల్లా మేకాతో రైతాంగం, గట్లమ్మట అడ్డదార్లను నడచి కూలిజనం, ప్రవాహంలా వస్తున్నారా తీర్థానికి. తీర్థానికి వచ్చే జనంలో కొందరు ఒకోడి పిల్లనో – మేకపోతునో వెంట తీసుకొస్తున్నారు. అవి అమ్మవారికిచ్చే నైవేద్యాలు, కొందరు చేతులూపుకుంటూ తీర్థం చూడ్డానికి, తీర్థంలో జరుగబోయే వింతల్ని చూడ్డానికి వస్తున్నారు.

మొత్తానికి అందరికీ చూడాలని వున్న వేడుక – ఎనుబోతుని అమ్మవారికి బలివ్వడం.

తీర్థం బిగిసింది. పన్నెండు, వంటి గంటకల్లా యిసుకేస్తే రాలనంత జనం. అమ్మవారి గుడికి వెళ్ళే వీధికి యిటూ అటూ ఎన్నో దుకాణాలు వెలిసాయి. ఊళ్ళోకి అడుగు పెట్టగానే డప్పుల చప్పుడు వినబడుతోంది.

కంచర సామాను దుకాణాలు, బుక్కాకొట్లు, బుడగల వాళ్ళు, మంచం మిఠాయి దుకాణాలు, రికార్డులు భోరున అరుస్తూ రెండు మూడు కాఫీ హూటలు పాకలు, కర్జూరపు పండుబళ్ళు, చేతికర్రల దుకాణాలు, ఏవేవో దుకాణాలు లేచాయి. గుడికి కాస్త దగ్గరలో అరటి పళ్ళ దుకాణాలు, కొబ్బరికాయ దుకాణాలు, అమ్మవారికి 'వార' పొయ్యటానికి తీపి కల్లు దుకాణాలు దట్టంగా అల్లుకున్నాయి. గుడి కుడిప్రక్క నున్న మైదానంలో రంగుల రాట్నం – చూసే వాళ్ళకి కళ్ళు తిరిగేలా తిరుగుతోంది. దానికి కాస్త పక్కగా ఆకాశాన్ని అంటేలా వున్న పెద్ద చక్రం తొట్టెలో జనాన్ని

ఎక్కించుకుని నిట్టూరుస్తూ తిరుగుతోంది. తొట్టిలో కూర్చున్న కొత్త జంటలు చంద్రుడి దగ్గర కెడుతోన్నట్టు తృప్తిపడుతున్నారు.

కొందరు ధైర్యంగల ఆడపిల్లలు "కచ్చా" పోసుకుని రంగులరాట్నానికి తగిలించి వున్న పులినో, ఏనుగునో ఎక్కి మొగాళ్ళతో సమానంగా తిరుగుతున్నారు. భయస్తులు రంగుల రాట్నానికున్న కుర్చీలో కూలబడి కళ్ళుమూసుకుని తిరుగుతున్నారు.

వీటికి కాస్త దూరంలో జనం గుంపుగా చేరారు. ఆ గుంపు మధ్య 'కవర్లాట' జరుగుతోంది. పుంజు, కాకి, పిల్లి, కుక్క, ఏనుగు మొదలైన జంతువుల, పక్షుల బొమ్మలుగల కాగితం పరచి వుది. పెట్టెలో వీటి బొమ్మలుగల కవర్లున్నాయి.

"కాయి రాజా కాయ్! పుంజు కాళీ – ఏనుగు కాళీ – కాకి కాళీ" అంటూ పెట్టిచప్పుడు చేస్తున్నాడు ఆటనడిపేవాడు. ఆడేవాళ్ళ నరాలు పొంగేలా, తీసిన కవరులో వున్న బొమ్మల మీద కాసిన వాళ్ళకి డబ్బులు లెక్క ప్రకారం రెట్టించి యిస్తున్నాడు. మిగిలిన బొమ్మలమీది డబ్బుల్ని కాగితం క్రిందికి లాగుతున్నాడు.

అలాగే దాని పక్కనే నెంబరు గుండాట – చక్రం ఆట జోరుగా సాగుతున్నాయి. సొమ్ము పోయిన వాడు తలగోక్కుంటున్నాడు. గెలిచినవాడు మీసం దువ్వుకుంటున్నాడు.

ఇంతలో యిద్దరు కానిస్టేబిల్స్ వస్తే వాళ్ళని పక్కకి తీసుకెళ్ళి ఏదో చేతిలో పెట్టారు ఆట తాలూకు హంగుదార్లు.

గుడిముందు ఖాళీస్థలంలో ఒకచోట పండరీభజన సాగుతోంది. 'పాండు రంగ విఠలే పండరీ నాథ విఠలే' అని పాడుకుంటూ, చెక్కచిడతలు వాయిస్తూ, కాషాయ వస్త్రాలు ధరించి గజ్జెలు కట్టుకున్న జనం ఎగురుతూ అడుగులు లయిగా వేస్తూ, భజన చేస్తున్నారు.

దాని తరువాత బేండు తన పని తను చేసుకుపోతోంది.

మరికాస్త దూరంలో సాయిబు సన్నాయిమేళం సాగుతోంది. వీటన్నిటి తరువాత 'గారడి' వాళ్ళు డప్పులు వాయిస్తూ గజ్జెలు మోగిస్తూ ఎగురుతున్నారు.

నలుగురు గుడ్డివాళ్ళు ఒకళ్ళ భుజాలు ఒకళ్ళు పట్టుకుని జట్టు విడిపోకుండా నడుస్తూ "బాబూ! కళ్ళులేని కబోదులం దరమం చెయ్యండి బాబూ" అంటూ జనానికి అడ్డుపడుతున్నారు. కళ్ళున్న జనం గుడ్డివాళ్ళలా వాళ్లని దాటుకు పోతున్నారు.

మరో ముగ్గురు కుష్టురోగులు డబ్బాలు చేత్తో పట్టుకుని వాటిలో పడిన డబ్బుల్ని చప్పుడు చేసుకుంటూ 'హిందూ తల్లీ హిందూ తల్లీ..... కన్నాదయ్యా – కన్న ఫలమేమి వున్నదయా' అని పాడుకుంటూ జనానికి అడ్డు పడుతూ వుంటే, వాళ్ళ బారినుండి పారిపోవడానికి, వాళ్ళని తాకకుండా తప్పించుకోవడానికి జనం తాపత్రయ పడుతూ చేతికి దొరికింది వాళ్ళకి దానం చేస్తున్నారు.

తీర్థం నిండు బియ్యపు బస్తాలా పిటపిటలాడుతోంది. అడుగు తీసి అడుగు వెయ్యడానికి వీలులేనంతగా జనం కిక్కిరిసి నడుస్తున్నారు. బూరాల ధ్వని, ఈలల

మోత, జనం గందర గోళం, వాయిద్యాల చప్పుళ్ళు సముద్రఘోషని మరిపిస్తున్నాయి. ఒకళ్ళ మాట ఒకళ్ళకి వినపడటంలేదు.

ఓ కుర్రకారు గుంపు తీర్థం మధ్య చొరబడి, దొరికిన అందాన్ని చేతులతో తడిమి తృప్తిపడుతున్నారు. చెయ్యిచెయ్యి పట్టుకుని విడిపోకుండా నడవాలనుకున్న జంట ఆ రద్దీలో చెరో ప్రక్కకి చెల్లా చెదురైపోతున్నారు.

గుడిముఖద్వారం ముందు వూపిరి సలపనంత తొడ తొక్కిడిగా వుంది జన సమూహం. సంద చీకటి చిక్కబడుతోంది. అప్పటిదాకా వెలవెల బోతోన్న గాస్‌లైట్ల కాంతి క్రమక్రమంగా పెరుగుతోంది. స్వామి నాయుడు గుడి ముఖద్వారం ముందు నిలబడి, నడుముకి కొత్తకండువా బిగించి, చేత కొత్త పొన్నుకర్ర పట్టుకుని జనాన్ని అదమాయిస్తున్నాడు.

మృత్యుముఖము నుంచి బయట బడిన రోగులు, వంటి నిండా మచ్చలతో, జుట్టు వూడిపోయి నీరసంగా అమ్మవారి దర్శనానికి వచ్చారు. స్వామినాయుడు వారిని గుడిలోకి నడిపిస్తున్నాడు అతి కష్టంమీద.

'కష్ట మొకళ్ళ దైతే ఫలితం మరొకళ్ళది' అన్న నేటి సాంఘిక న్యాయంలా ఆరోగులు బతికి బయట పడటానికి తాను కారణం కాకపోయినా ముడుపులు అందుకొంటోంది నూకాలమ్మ.

నూకాలమ్మ విగ్రహం చూడ్డానికి ఎంతో భీకరంగా వుంది. పెద్ద నాలిక బయటికి చాపి, చూపులతో జనాన్ని మింగేసేటంత కళ్ళతో భయంకరంగా వుందా విగ్రహం. మూఢవిశ్వాసాలు, మూర్ఖత్వంవల్ల వచ్చే భయంకర పరిణామాల్ని ఒక్కచోట పోతపోసినట్టుంది ఆ ఆకారం.

గణాచారి, అమ్మవారి పాదాల దగ్గర, గర్భగుడిలో తలవిరబోసుకుని కూర్చుంది అమ్మవారి వారసురాలిలా.

ఇంతలో స్వామినాయుడు కూతుర్ని తీసుకొని గుళ్ళోకి ప్రవేశించాడు. అతని వెనకే వెంకన్న కొడుకుని తీసుకొని లోపలికొచ్చాడు. స్వామినాయుడు కూతురికి కళ్ళలో పువ్వులు వేసి చూపుపోయింది. ఆ పిల్ల అమ్మ వారిని చూడలేదు. అయినా అమ్మవారికి ఆ పిల్లని చూపించాలని తీసుకొచ్చాడు స్వామినాయుడు.

వెంకన్న కొడుక్కి కాలుతోడేసింది. కర్ర ఆసరా యిచ్చి దర్శనానికి తీసుకొచ్చాడు వెంకన్న.

ఆ పిల్లలిద్దరూ అంగవికలులైనా అమ్మవారి దయవల్లే వాళ్ళిద్దరూ బతికి బయటపడ్డారని ఆ వూరి పెద్ద వెంకన్న, గుడి పెద్ద స్వామి నాయుడుల నమ్మకం.

అంతేకాని ఆ పిల్లలలా గుడ్డీ, కుంటి కావడానికి కారణం వాళ్ళు ఆలోచించరు అర్థం చేసుకోరు.

చల్ల ఘటం వూరు తిరిగి వచ్చింది యింతలో, మిగిలిన గరగలు ఆలయంలోంచి బయటకొచ్చాయి. గరగలకి కొత్త చీరెలు కట్టి పువ్వులు ముడిచి అందంగా అలంకరించారు. వాటిని నెత్తిన పెట్టుకున్న చాకళ్ళు డప్పుదెబ్బ కణుగుణంగా 'ఝునం ఝునకడి ఝునం ఝునకడి' అంటూ ఆడుతున్నారు. గణాచారి వేపరొట్ట

చేత్తో పట్టుకుని వాళ్ళతో సమానంగా ఆడుతోంది. ఉన్నట్టుండీ వాళ్ళలో ఒకళ్ళకి అమ్మవారు పూనుతోంది. ఆ మనిషి గరగతో సహా మెలికలు తిరిగిపోతున్నాడు. ఆ మనిషి ముందుకెళ్ళి డప్పుల వాళ్ళు మరీ గట్టిగా వేగంగా దరువు వేస్తున్నారు. చుట్టూ చేరిన జనం భక్తిలో, గరగెత్తుకుని ఆడుతున్న వాళ్ళకి కోడి పిల్లల్ని అందిస్తున్నారు. కోడిపిల్లని చిత్రంగా అందుకుని మెడకొరికి జనంలోకి విసిరేస్తున్నారు వాళ్లు. ఆ రక్తం జనం మీద చిందుతోంది. అలా ముప్పై నలభై కోడిపిల్లల్ని ఒక గంటలో కొరికి పారేస్తున్నారు వాళ్ళు.

ఆ దృశ్యం జనానికెంత తృప్తి. నూకాలమ్మ వాళ్ళ నైవేద్యాన్ని అందుకుని ఆరగించిందన్న ఆనందం.

కాని ఓ ముసలితాత భుజాల మీద కూర్చున్న రెండేళ్ళ కుర్రాడు ఆ రక్తాన్ని ఆ కోళ్ళు గిలగిల తన్నుకోడాన్ని చూసి భయపడి ఏడుస్తున్నాడు. 'బయ్యం లేదహె. సూత్తావుంటే అలవాటైపోద్ది. బయ్యం పోద్ది సూడెహె' అని సముదాయిస్తున్నాడు ముసలి తాత మనువణ్ణి.

ఇంతలో జీవకారుణ్య సంఘం స్వామీజి తన శిష్యుల్ని వెంటబెట్టుకొని గుడివైపు వస్తున్నారు అక్కడ జరుగుతున్న హింసని చూసి, సహించలేక 'కృష్ణ కృష్ణ, రామ రామ' అనుకుంటూ దృష్టిని మరో ప్రక్కకి తిప్పుకుని నడుస్తున్నారు. అమ్మవారికి యివ్వబోయే బలుల్ని ఆపాలనే ఆయన అంత ఆత్రంగా వస్తున్నారు. ఆలయానికి దగ్గరౌతున్నారు. డప్పుల మోత మరీ ఎక్కువైంది. ఎనుబోతును బలి ఇచ్చే సమయం దగ్గర పడుతోంది. ఎనుబోతును నరకడం చూడాలన్న కుతూహలంతో జనం ఉవ్విళ్ళూరుతున్నారు. జనం ఆత్రంగా అటు తిరిగారు.

ఆ జనంలోని ఆవేశాన్నీ ఆత్రాన్నీ చూసి, స్వామీజీ 'తొలిసంతానాన్ని గంగలో పడేసేవాళ్ళు, లంకెల బిందెల కోసం నేటికి నరబలులిచ్చే వాళ్ళు పుట్టిన యీ దేశంలో ఎందరు బుద్ధులు పుట్టినా గాంధీలు పుట్టినా హింస మీద ఆసక్తి మాసిపోదేమో' అనుకున్నారు.

బలి పశువును యిద్దరు బలమైన ఆసామీలు, మెడకి తాడువేసి చెరోపక్క నడుస్తు లాక్కొస్తున్నారు. వెనుకనుంచి యిద్దరు తోలుతున్నారు. బలిపశువుగా నిర్ణయించబడిన నాటి నుంచి ఆ ఎనుబోతు కాలారినంత మేల తిరుగుతూ, నోరారకుండా నచ్చింది మేస్తూ వుండడంతో గుప్పెడెత్తునకండ పట్టివుంది. ఈగవాలితే జారిపోయేటంత నున్నగా, నూనె పులిమిన నల్ల పాలరాయిలా వుంది దాని శరీరం. దాన్ని గుడిముందు తాళ్ళతో బంధించి నిలబెట్టారు. ముఖానికి పసుపు రాసి, మెడలో వేప కొమ్మ కట్టారు. మూడుసార్లు గుడి చుట్టూ తిప్పి, తీసుకొచ్చి గుడి ముందు నిలబెట్టారు. దలారి బారకత్తి చేతపట్టి సిద్ధంగా వున్నాడు.

'ఊఁ అయిచంద్రా' అన్నాడు స్వామినాయుడు డప్పుల వాళ్ళని ఉద్దేశించి. డప్పులమీద దరువు వీరావేశం ఎత్తించేలా వుంది. గరగలు వళ్ళు మరచి ఆడుతున్నాయి. బాణాసంచా జోరుగా కాలుస్తున్నారు. ఈత చెట్టు అంటించారు. చెవులు బద్దలయ్యేలా పేల్తున్నాయి పేల్పులు –

'ఊఁ కానివ్వండి' అన్నాడు స్వామినాయుడు యిక బలి యివ్వండన్న ధోరణిలో.

ఇంతలో స్వామీజీ ముందుకొచ్చి 'ఆగండి!' అని అరిచారు.

జనం ఆయన వైపు తిరిగారు.

"జీవహింస పాపం నాయనా! నాగరికులు బలులు యివ్వకూడదు" అని యింకా ఏదో చెప్పబోయాడు.

బయట గొడవలో చాలా మందికి ఆయన మాటలు వినబడలేదు.

పక్కకి తప్పుకోవయ్యా. 'అమ్మోరి కద్దునెగు' అన్నాడు వెంకన్న, దాంతో మళ్ళీ జనంలో కలకలం, డప్పుల చప్పుడు ప్రారంభమైంది.

'నేను చెప్పేది వినిపించుకోండి' అని బిగ్గరగా అరుస్తూ చేతులు పైకెత్తి డప్పులు వాయించొద్దన్నట్టు సంజ్ఞ చేసాడు.

డప్పుల గోల కొంచం సద్దణిగింది.

'జీవహింస పాపం నాయినా. బలులు యివ్వకూడదు' అన్నారు స్వామీజీ ఎంతో శాంతంగా.

'అట్టాగనే యీమద్దె మానేసాం. వూరుని దులిపొదిలేసి నాది అమ్మోరు. అది కాకపోనా అమ్మోరికి బలిత్తే పాపమటయ్యా!' అన్నాడు వెంకన్న.

'బలి అమ్మవారికి అక్కర్లేదు నాయనా. దేవతలకి బలికావాలనుకోవడం మనపిచ్చి నమ్మకం మాత్రమే.'

'మరట్టాగైతే గణాచారి బలికావాలని ఎందుకడిగిందేటి?' అన్నాడు స్వామినాయుడు.

ఇంతలో గణాచారి 'నరులారోయ్! నాకు బలి కావాలర్రోయ్' అంటూ జనంలోంచి గెంటుకొంటూ వచ్చి, స్వామినాయుడు ముందు ఆడటం మొదలెట్టింది. చూడు సామా అన్నాడు వెంకన్న స్వామీజీని వుద్దేశించి.

'దేవతా దేవుడు మనందరిలోనూ వున్నారు. మనం బలి కావాలంటున్నామా? దేవుడు సర్వ జీవరాసుల్లోనూ వున్నాడు ఏ జీవిని చంపినా దేవుడ్ని చంపినట్టే' అన్నారు స్వామీజీ వేదాంత ధోరణిలో.

'నాకాకలి తీరటంలే దర్రోయ్, నరులారోయ్' అంటూ గణాచారి వీరావేశం ఎత్తినట్టు గెంతుతోంది.

'అది మా మొక్కుబడి సామీ, ఆ బలి ఆపటానికిల్లేదు'. అన్నాడు స్వామినాయుడు తుది నిర్ణయంలా.

స్వామీజీ ముఖం గంభీరంగా మారింది. 'అదే మీ అభీష్టమైతే, ముందు నన్ను నరికి, ఆ తరువాతే ఆ ఎనుబోతును నరకండి'. అని గుడిముందు కటికనేల మీద కూర్చున్నారు స్వామీజీ.

'సామి మొండికేసాడు. ఎట్టాగ నాయడా?' అన్నాడు వెంకన్న స్వామినాయుడు చెవిలో.

స్వామి నాయుడికి ఏమీ పాలుపోక, తలగోక్కుంటూ యిటూ అటూ చూశాడు. ఇంతలో అవూరికి ఆ చుట్టు పక్కల వూళ్ళకి పెద్ద వ్యవహర్తగా చలామణీ అవుతూన్న నరసింహం, పైమీది కండువా సర్దుకుంటూ గుడివైపే వస్తున్నాడు.

చాకలి గంగడు కొబ్బరిచక్కలు, అరటి పళ్ళు బుట్టతో ఎదురు పడ్డాడు నరసింహానికి. 'ఎక్కడివిరా అవి?' అన్నాడు నరసింహం.

'తవరింటికేనండి నాయుడుగో రిచ్చిరమ్మన్నారు.' అన్నాడు గంగడు వినయంగా.

'ఊఁ! వెళ్లు' అని ఆలయం ముందుకి నడిచాడు నరసింహం.

స్వామినాయుడికి, నరసింహాన్ని చూసేటప్పటికి ప్రాణం లేచొచ్చింది.

'ఏమిటి స్వామి అలా కటికనేలమీద కూర్చున్నారు.' అంటూ నరసింహం చేతులు జోడించుకొని స్వామీజీ దగ్గర కెళ్లాడు.

'నువ్వుండికూడా, యింత హింసాకాండ జరిగిపోతుంటే ఎలా చూస్తూ వూరుకున్నావయ్యా?' అన్నారు స్వామీజీ కాస్త మందలింపుగా.

'చెపితే విననివాళ్ళకి చెప్పి ప్రయోజనం ఏమిటి స్వామి? అందుకే యిదంతా చూడలేక యింట్లోనే పాతుకుపోయాను. మీరొచ్చారని తెలిసి, మీ దర్శనము, అమ్మవారి దర్శనమూ కూడ లభిస్తుందని చక్కా వచ్చాను.'

'ఏది ఏమైనా తమరలా కూర్చోడం ఎంతమాత్రం బాగాలేదు లేవండి.' అన్నాడు నరసింహం బతిమాలుతోన్న ధోరణిలో.

'లాభం లేదయ్యా. బలి ఆపడానికి వాళ్లు అంగీకరిస్తే గాని నేనిక్కడనుంచి లేవను' అన్నారు స్వామీజీ దృఢ నిశ్చయంతో.

పరిస్థితి బిగిసిపోయిందని గ్రహించిన నరసింహం వెంకన్ననీ స్వామినాయుడ్ని దగ్గరకు రమ్మని సైగ చేసి 'ఆయనంత కాదంటూవుంటే మీకంత పట్టుదల ఎందుకు వెంకన్న? ఆపేస్తే పోలేదు. సర్వం తెలిసిన మహానుభావులు వారు. వారిమాట కాదనడం మనకి మాత్రం భావ్యమా నాయుడు' అన్నాడు నరసింహం.

నరసింహం చూపులకి చిరకాలంగా అలవాటు పడ్డ నాయుడు, వెంకన్న — ఆ చూపులోని తంత్రాన్ని అర్థం చేసుకున్నారు. అతని మాటల్లోని భావాన్ని గాలికొదిలేశారు.

'సరే. నీ మాట మేం కాదన్నావేటి ఎప్పుడేన్నా?' అన్నాడు స్వామినాయుడు అంగీకార సూచకంగా.'

'యిక యింటికి వెడదాం రండి. కాస్త ఫలహారం తీసుకుని విశ్రమిద్దురుగాని' అని శిష్యులతో సహా స్వామీజీని తన యింటివైపు నడిపించి, వెనక్కి తిరిగి వెంటనున్న వెంకన్నకి 'కానియ్యండి మీపని' అన్నట్టు కళ్ళతోటే ఆదేశించాడు నరసింహం.

లౌకికుని లౌకికం అలౌకికుడైన వేదాంతికి అర్థం కాలేదు. నాయుడు, వెంకన్న ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని, నవ్వుకుని 'ఊఁ యిక వాయించండ్రా' అన్నారు డప్పుల వాళ్ళని.

ఈసారి వాతావరణం మరీ గందరగోళంగా వుంది. జనంలో ఈలలు అరపులు, కేరింతలు, అంతా హడావుడిగా వుంది.

ఆ డప్పుల చప్పుడికి, జనం గోలకి బిత్తరపోయింది యేనుబోతు. శక్తికొద్దీ గుంజుకుంటూంది, ప్రయోజనం లేకపోయినా.

ఇంతలో జనాన్ని గెంటుకుంటూ పోలీస్ ఇన్‌స్పెక్టరు వచ్చాడు. బందోబస్తు కొచ్చిన యిద్దరు కానిస్టేబుల్స్ ఏమూలనుంచో జీప్ చూసి చెమటలు కక్కుతూ ఇన్‌స్పెక్టర్ని చేరుకున్నారు, వెంకన్న కాస్త కంగారు తిన్నాడు.

'ఎనుబోతుని బలివ్వడానికి వీల్లేదు. వదిలెయ్యండి ఆ ఎనుబోతును' అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఎనుబోతుని పట్టుకున్న వాళ్ళతో.

'అది మా మొక్కు అపటానికి వీల్లేదు' అన్నాడు స్వామినాయుడు కటువుగా.

'ఎప్పటినుంచో వత్తన్న ఆచారం. మా ఒళ్ళంతా సచ్చిబతికారు. బలి అపటానికీల్లేదు' అన్నాడు వెంకన్న.

'అపటానికీల్లేదు. బలి అపటాని కీల్లేదు' అంటూ జనం పిచ్చిగా అరవడం మొదలుపెట్టారు.

జనం గెంటుకుని మీదిమీది కొస్తున్నారు. జనంలోంచి కంకర్రాళ్ళు పడటం మొదలయ్యింది. ఇన్‌స్పెక్టర్ ధైర్యం తగ్గింది.

రివాల్వర్ తీసి గాలిలోకి పేల్చాడు. 'కదిల్తే కాల్చేస్తాను ఎక్కడివాళ్ళు అక్కడే వుండండి' అన్నాడు. ఆ ధైర్యంతో కానిస్టేబుల్స్ జనాన్ని లాటీలతో వెనక్కి నెట్టడం మొదలెట్టారు.

ఇన్‌స్పెక్టర్ కోపంగా ఏనుబోతున్న వైపు నడిచాడు. ఎనుబోతుని పట్టుకున్న వాళ్ళు పట్టు సడలించారు. వదిలేసి పారిపోడానికి సిద్ధమౌతున్నారు.

ఆ గందరగోళం అంతా చూసి బెదిరిపోయిన ఎనుబోతు ఒక్కసారి గుంజుకుని గుంపుమీద పడింది. అడ్డొచ్చినవాళ్ళని కుమ్ముతూ, కాలికి దొరికినవాళ్ళని తొక్కుతూ జనాన్ని చెల్లాచెదురు చేసి పారిపోయింది.

ఆ సమయంలో జనం అరపులు, పిల్లలు ఏడుపులు, ఆడవాళ్ళ ఆర్తనాదాలు – అంతా అంతా ఒక్క అరనిముషం భూకంపం వచ్చినంత పనైంది. స్వామినాయుడి కూతురి పొట్ట మీద అడుగేసి తొక్కేసింది యెనుబోతు. పేగులు బయట పడ్డాయి. మరికొందరికి కొమ్ములుదిగి స్పృహపోయింది.

"మీ అమ్మవారిదగ్గర శక్తి వుంటే, నిజంగా యెనుబోతే కావాలంటే యెనుబోతుని వెనక్కి రప్పించుకోమనండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గర్వంగా.

వెలుగు వస్తోంది.

యెనుబోతు తిరిగి రాలేదు.

గుడి తలుపులు మూత బడ్డాయి.

నూకాలమ్మ చీకట్లోకి వెళ్ళిపోయింది.

తీర్థం చప్పబడింది –.

★ ★ ★